క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన

మణుగూరురూరల్: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సైబర్ నేరాలు, క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్‌కు సంబంధించిన ఏ వివరాలనూ ఇతరులకు తెలపొద్దని సూచించారు. ఏఎస్సై జ్యోతి, హెడ్‌కానిస్టేబుల్ కోటి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు

చర్లరూరల్: పూర్తి ఏజెన్సీ అటవీ గ్రామాలైన బత్తిన పల్లి, బట్టిగూడెంలలో బుధవారం సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్యాధికారిని దివ్యనయన ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లో సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేయగా.. ముగ్గురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. అనంతరం పరిశుభ్రతపై సూచనలు చేశారు. డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్‌ఈఓ బాబూరావు, ఎంఎల్‌హెచ్‌పీలు సంధ్య, పార్వతి, దీప్తి, మౌనిక, హెల్త్ అసిస్టెంట్లు వరప్రసాద్, సుబ్బారావు, వేణు, ఆశా కార్యకర్త జోగమ్మ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామాలైన ఖమ్మం తోగు, బుగ్గ, బుడుగుల లలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మొదటి విడత దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ లింగ్యా నాయక్ గ్రామస్తులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుజాత, కౌసల్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఎస్‌ఐగా శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రింగ్‌రోడ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మాల మహానాడు, ఎంఆర్‌పీఎస్, నాయకపోడు సంఘాల ఆధ్వర్యంలో పూల మాల వేసి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సంఘాల నాయకులు జక్కుల రాంబాబు, ఏపూరి వెంకటేశ్వరరావు, తంబళ్ల రవి, నాగేందర్, వాసం పోలయ్య, గుమ్మళ్ల గోపి, ఏవీ రామారావు, కోలేటి ఫకిరయ్య, రావూరి వీరయ్య, కొలికెవెంకటేశ్వరరావు, కాంతారావు, నాగరాజు పాల్గొన్నారు.

షెడ్యూల్ విడుదల చేయాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు బుటారి రాజు, మునిగడప రామాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 6న హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బట్టా ప్రసాద్, బి.రవి, వి.ముత్తయ్య, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చంద్రుగొండ: నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ సంధ్యారాణికి బుధవారం వినతిపత్రం అందించారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్‌పార్టీ అనేక హామీలు ఇచ్చిందని బీజేవైఎం మండల అధ్యక్షుడు భూక్యా రాంపండు అన్నారు. బీజేపీ నాయకులు భోగి కృష్ణ, నల్లమోతు రఘుపతిరావు, మోహన్‌నాయక్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, శ్రీరాం పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయాలి

కరకగూడెం: మండలంలోని రైతుల పంట పొలాల్లో ఏ పోషక విలువలు ఎంత మోతాదులో ఉన్నాయో వారికి తెలియజేయడంతో పాటు భూముల్లో పోషక విలువలు గుర్తించేందుకు భూసార పరీక్షలు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు చేయాలనీ సీపీఐ మండల కార్యదర్శి వంగరి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం అనంతారం గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: విధి నిర్వహణలో ఉన్న అంగన్‌వాడీ ఆయాపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ములకలపల్లిలో విలేకరులకు వివరాలు తెలిపారు. మండలపరిధిలోని పూసుగూడెం సెంటర్ అంగన్‌వాడీ ఆయా కనకతారపై భూక్యా భద్రు, అరుణ, కావేరీలు అకారణంగా చేయి చేసుకున్నారని ఆరోపించారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెడ్డి అరుణ, గోనె మణి పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో ఏరులై పారుతున్న సారా
- దాడులు నిర్వహించినా ఆగని తయారీ
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు



దుగినేపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

పినపాక: ఉమ్మడి పినపాక మండలంలో గుడుంబా ఏరులై పారుతుంది. గ్రామ గ్రామాల్లో గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు దొరకడంతో ప్రజలు దానిని సేవించి అనారోగ్య పాలవుతున్నారు. పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేస్తున్నారు. నిర్వాహకులపై బైండోవర్ కేసు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ అమ్మకాలు ఏమాత్రం తగ్గడం లేదు. మారుమూల గ్రామాల్లో, అడవుల్లో చాటుగా తయారు చేసే గుడుంబా ప్రస్తుతం ప్రతి గ్రామంలో తయారు చేసి విక్రయిస్తున్నారు. బయ్యారం, ఎల్సిరెడ్డిపల్లి, సీతారాంపురం, దిగినేపల్లి, జానంపేట, ఉప్పాక, అమరారం గ్రామాల్లో గుడుంబా అధికంగా విక్రయిస్తున్నారని సమాచారం.

బానిసలవుతున్న ప్రజలు

మద్యం కంటే గుడుంబా తక్కువ ధరకు దొరకడం వల్ల రోజువారి కూలీలు, రైతు కూలీలు ఎక్కువగా సేవించి అనారోగ్య పాలవుతున్నారు. చౌక ధరకు దొరకడం వలన పనులు మానుకొని వాటికి బానిసవుతున్నారు. గ్రామాల్లో మద్యం దుకాణాల కంటే గుడుంబా దొరికే ప్రాంతాలే ఎక్కువగా ఉండటం దీనికి కారణం.

ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు

గుడుంబా తయారీ, అమ్మకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించారు. గ్రామ గ్రామాల్లో తిరుగుతూ గుడుంబావలన కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో ఎక్సైజ్ అధికారులు ఇటీవల దిగినేపల్లి గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గుడుంబా తయారుచేసిన, అమ్మిన, తయారీ విధానంలో ఉపయోగించే బెల్లాన్ని అమ్మిన వారిపై బైండోవర్ కేసుల నమోదు చేసి లక్ష రూపాయల వరకు అధికారులు జరిమానా విధిస్తున్నారు. అధికారులు కేసులు నమోదు చేయడమే కాకుండా గ్రామ గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తున్న వారిని గుర్తించి వాటిని కూడా కట్టడి చేయాలని మహిళలు కోరుతున్నారు.

గుడుంబా రహిత మండలమే లక్ష్యం

ఉమ్మడి పినపాక మండలంలో గుడుంబా తయారీపై ఉక్కు పాదం మోపుతున్నాం. తయారీదారులపై, అమ్మిన వారిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తున్నాం. ఆగస్టు 15 కల్లా పై అధికారుల ఆదేశాల మేరకు గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– రాజిరెడ్డి, ఎక్సైజ్ సీఐ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



శంభూనిగూడెంలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండాల: మండలంలో మంచినీరు, విద్య, వైద్యం, సాగునీరు రోడ్లు తదితర సమస్యలు ఏం ఉన్నా తక్షణమే అధికారులు పరిష్కరించే దిశలో ఉండాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని చెట్టుపల్లి, శంభూనిగూడెం పంచాయతీ గ్రామాల్లో పర్యటించి స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో విష జ్వరాలపై వైద్యాధికారులు అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలని సూచించారు. స్థానిక పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయుల ద్వారా అడిగితెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితిగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్ల ప్రతీ ఇంటికీ అందించాలన్నారు. అంతర్గత రోడ్లు ఎక్కవకావాలో ప్రణాళికలు వేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ఇల్లెందు మీదుగా చెట్టుపల్లి, శంభూనిగూడెం మీదుగా ఆర్టీసీ బస్సు నడిపించేందుకు సంబంధిత డిపో మేనేజర్లతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే బస్సు నడుస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అనారోగ్యంతో ఆస్పత్రి నుంచి వచ్చిన షేక్ జిలాని బేగం, ఆర్‌ఎంపీ సత్యంలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ రామక్క, ఎంపీటీసీ కృష్ణారావు, వివిధ శాఖల ఏఈలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కే. ఖదీర్, ముత్యమాచారి, ముత్తయ్య, పాపారావు, దారా అశోక్, కిరణ్ పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: వానకాలం దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రులకు వచ్చే రోగులకు సేవలందించే విషయంలో నిత్యం అప్రమత్తతో ఉండాలని, మెరుగైన వైద్యం అందించి భరోసా కల్పించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో నియోజకవర్గ పీహెచ్‌సీ, సీవిల్, 100 పడకల ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, చికన్‌గున్యాలు ప్రబలకుండా మొదటి దశలో ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలువురు వైద్యులు ఆస్పత్రికి రావాల్సిన గ్రాంట్లు రావడం లేదని వివరించగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి అవి వెంటనే మంజూరు అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ రాజ్‌కుమార్ 100 పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్, డాక్టర్లు శైలేష్, సంకీర్త, మనీష్‌రెడ్డి, శృతి, మధు, రేవంత్, శివ తదితరులు ఉన్నారు.

పీఆర్ డీఈఈగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ



అశ్వారావుపేటరూరల్: పంచాయతీ రాజ్ అశ్వారావుపేట డీఈఈగా పి.శ్రీధర్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయంలో గురువారం విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టారు. అశ్వారావుపేట డీఈఈగా పని చేసిన ఎస్.రామం గడిచిన జూన్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయడంతో డీఈఈ పోస్టు ఖాళీ అయింది. కాగా ఏఈఈగా పని చేస్తున్న శ్రీధర్‌రావుకు డీఈఈగా పదోన్నతి రాగా ఇక్కడే డీఈఈ పోస్టింగ్ రావడం గమనార్హం. ఈ మేరకు నూతన డీఈఈగా విధుల్లో చేరిన శ్రీధర్ రావును కిందిస్థాయి ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలను అందించి హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యా సంస్థల బంద్

గుండాల: నీట్ పరీక్షను పేపర్ లీక్‌చేసి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని, నీట్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యా సంఘాల ఆధ్వర్యంలో నేడు విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ట్రిపుల్ ఐటీలో సీటు

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన దేరంగుల సుభాష్‌కుమార్ అను విద్యార్థి, బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందాడు. నాచారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24లో పదవ తరగతి పూర్తి చేసిన సుభాష్ కుమార్.. పది ఫలితాల్లో 9.8 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాడు. బుధవారం బాసర ఐఐఐటీ వారు ఆన్‌లైన్‌లో వెలువరించిన ప్రవేశాల జాబితాలో సుభాష్ కుమార్‌కు స్థానం దక్కింది. ఐఐఐటీలో ప్రవేశం పట్ల, సుభాష్‌ను ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

బీరువాలు వితరణ

అన్నపురెడ్డిపల్లి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కొత్తగూడెం డివిజన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలకు బీరువాలను వితరణ చేశారు. బుధవారం అబ్బుగూడెం యూపీఎస్ పాఠశాలకు 1 బీరువా, మర్రిగూడెం యూపీఎస్ పాఠశాలకు 1 బీరువా, అన్నపురెడ్డిపల్లిలోని అన్నదైవం పాఠశాలకు 2 బీరువాలను అందజేశారు. సీఎస్‌ఆర్ ఫండ్‌లో భాగంగా అందించినట్లు ఇన్‌చార్జ్ ప్లాంటేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, ఎఫ్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేయాలి

పినపాక: మండల పరిధిలోని బయ్యారం క్రాస్ రోడ్ లో డ్రైయినేజీ పూడికి తీత పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీఓ వెంకటేశ్వరరావు పంచాయతీ సెక్రెటరీ, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం క్రాస్ రోడ్‌లో డ్రైనేజీ పనులను పరిశీలించిన ఆయన.. రోడ్డుపై వర్షపు నీళ్లు, బురద నిలవకుండా ఉండటానికి చర్యలు చేపట్టాలన్నారు. పూడికతీత సమయంలో రోడ్డుకిరువైపులా బ్లీచింగ్ చల్లాలన్నారు.

సమస్యలపై పోరాటం

దుమ్ముగూడెం: ప్రజల సమస్యల పరిష్కారం చేయకుంటే పోరాటం తప్పదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తక్షణమే ప్రగలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ నిధులు కేటాయించాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బంద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డివిజన్ పరిధిలోని భద్రాచలం, కోర్రాజులగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ మెయింటెనెన్స్ కారణంగా గురువారం(నేడు) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజుపేట కాలనీ, జగదీష్ కాలనీ, భగవాన్ దాస్ కాలనీ, కోర్రాజులగుట్ట, అల్లూరి సీతారామ రాజు కాలనీ, ఐటీడీఏ రోడ్డు, వెంకటేశ్వర కాలనీ, మెడికల్ కాలనీ, లంబాడీ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, సుందరయ్య నగర్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్లు భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఏఎంసీ కాలనీ ఫారెస్ట్ టింబర్ డిపో వద్ద ఐటీడీఏ వెనకాల మనుబోతుల చెరువు దగ్గర నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు కేటాయించాలని బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ఆర్డీఓ దామోదర రావుకి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మునిశెట్టి రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. మూడు స్టేర్లుగా ఇళ్లు నిర్మించి పూర్తై చాలా కాలమైనా.. ఇప్పటి వరకు అర్హులైన వారికి కేటాయించలేదని ఆరోపించారు. కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆవుల సుబ్బారావు, నిడదవోలు నాగబాబు, ముత్యాల శ్రీనివాస్, సూరత్ సుదర్శన్, అన్నం సాయి లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం స్థలాన్ని దున్నేశారు..



క్రీడాప్రాంగణం ప్రదేశాన్ని దున్నిన దృశ్యం

ములకలపల్లి: ములకలపల్లి హైస్కూల్ ఆవరణలోని క్రీడాప్రాంగణం స్థలాన్ని దున్నేయడంపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఇటీవలే రూ 4.55 లక్షల వ్యయంతో తెలంగాణా గ్రామీణ క్రీడాప్రాంగణం నిర్మించారు. బోర్డు ఏర్పాటు చేశారు. ఖర్చులను వివరిస్తూ, ఫలకాన్ని కూడా పెట్టారు. అయితే వనమహోత్సవం నిమిత్తం మొక్కలు నాటేందుకు ఈ ప్రాంతాన్ని దున్ని, గోతులు తీశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి, క్రీడాకారులకు ఉపయోగపడుతున్న స్థలంలోనే మొక్కలు వేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు ప్రత్యామ్యాయం దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ భారతిని వివరణ కోరగా, స్కూల్ ప్రహరీకి అతిసమీపంలో మొక్కలు నాటుతామని తెలిపారు. క్రీడాప్రాంగణానికి ఆటంకం కలిగించమన్నారు. గడ్డి బాగా పెరిగినందున దున్నించినట్లు తెలిపారు.

అధైర్యపడొద్దు.. అందుబాటులో ఉంటాం..



నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవొద్దని అందరికీ అందుబాటులో ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధైర్యం నింపారు. బుధవారం నడికుడి గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన భద్రాచలం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అందరూ సమష్టి కృషి చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులను గెలిపించుకునే విధంగా కష్టపడాలని సూచించారు. కాగా, తెలుగుదేశం పార్టీ నాయకులు వాగే వెంకటేశ్వరరావు–లక్ష్మీ దంపతులు పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. డివిజన్ నాయకులు మానే రామకృష్ణ,రావూలపల్లి రాంప్రషాద్, పార్టీ మండల అధ్యక్షుడు అన్నే సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి కణితి రాముడు, గూడవర్తి నర్సింమూర్తి, దొడ్డి తాతారావు, గంపా రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఏరియాలో 94శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: గడిచిన జూన్ నెలలో మణుగూరు ఏరియాలో 94శాతం బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత లక్ష్యం 79శాతంగా నమోదైందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో 11.16 లక్షల టన్నులకు గాను 10.52 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి నమోదైందని చెప్పారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రైలు, రోడ్డుమార్గాల్లో 31.46 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని తెలిపారు. కాగా, వర్షాల కారణంగా ఓబీ వెలికితీతకు ఆటంకం ఏర్పడిందని చెప్పారు. ఇక సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హెల్త్ స్క్రీనింగ్ చేపట్టనున్నామని, వైఎస్ఆర్ నగర్‌తో పాటుక్వార్టర్లకు చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు లక్ష్మీపతిగౌడ్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, రమేశ్, మేరీకుమారి, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కోతకు గురైన డైవర్షన్ రోడ్డు



కోతకు గురైన డైవర్షన్ రోడ్డు మీదుగా వాగు దాటుతున్న విద్యార్థులు

ములకలపల్లి: మండలపరిధిలోని ముత్యాలంపాడు శివారు పాలవాగుపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు మరలా కోతకు గురైంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోగా, ముత్యాలంపాడు, రాచన్నగూడెం జీపీకేంద్రాలతోపాటు, రాచన్నపేట, జిన్నెలగూడెం, మోటుగూడెం, పాతజిన్నెలగూడెం గ్రామాలకు సాయంత్రం వరకూ రాకపోకలు నిలిచిపోయాయి. ఈవాగుపై నూతన వంతెన నిర్మాణాన్ని చేపడుతుండగా.. శిథిలమైన లోలెవల్ చప్టాలను పూర్తిగా తొలగించారు. డైవర్షన్ రోడ్డు వేసి, బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్నారు. మే నెలలో కురిసిన వర్షాలకు 25వ తేదీన డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. దీంతో రెండు రోజులపాటు రహదారి సౌకర్యం లేకుండా పోయింది. మరమ్మతుల తరువాత ఇప్పుడు తిరిగి ఇదేపరిస్థితి ఏర్పడింది. నలభై రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు డైవర్షన్ రోడ్డు తెగిపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. కాగా, సాయంత్రానికి మట్టిపోసి తాత్కాలికరంగా రహదారి సౌకర్యం ఏర్పాటు చేశారు. అయితే, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితర మండల స్థాయి అధికారులెవరూ 10.30 గంటల వరకూ సంఘటనా స్థలానికి చేరుకోలేదు. వ్యవసాయ పనులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో స్థానికులు ప్రమాదకర పరిస్థితుల్లోనే వాగును దాటి బటికి వెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజమౌళి హుటాహుటిన వచ్చి రాకపోకలు నియంత్రించారు.

క్షేత్రస్థాయిలో పనిచేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ: మంచి పనితీరుతోనే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, క్షేత్రస్థాయిలో ఆ మేరకు పనిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్లక్ష్యం వహించే అధికారులను, సిబ్బందిని సహించబోమన్నారు. వర్షాకాలంలో ముందస్తుగా తీసుకునే చర్యలను ఆయన వైద్యాధికారులు, పంచాయితీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి ఇక నుంచి పంచాయతీ కార్యాలయంలో రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాల్సి ఉంటుందని సూచించారు. మరోవైపు, మండలకేంద్రం చంద్రుగొండలో ప్రధాన సెంటర్ నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు డ్రైయినేజీని 22 అడుగుల వెడల్పు మాత్రమే చేయాలని రోడ్డుకు ఇరువైపులా ఉండే వ్యాపారస్తులు, గృహ యజమానులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం 50 అడుగులు వెడల్పు చేయాల్సి ఉంటుందన్నారు. అధికారులతో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే జారే చెప్పారు. కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, వివిధ శాఖాధికారులతో పాటు ఎంపీపీ పార్వతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పాపిడిగూడెం ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని పాల్వంచ ఎఫ్‌డీఓ దామోదర రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు, విద్యార్థులతో కలిసి ప్లాంటేషన్‌లో వివిధ రకాల మొక్కలు నాటారు. మొక్కలపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, ఫారెస్ట్ రేంజర్ మురళి, కాంగ్రెస్ నాయకులు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

చర్లరూరల్: మండలంలోని పెద్దిపల్లి పడవ రేవు వేలంపాటను ఎంపీడీఓ కె.ఈదయ్య వాయిదా వేశారు. బుధవారం జరగాల్సిన వేలంపాటలో పాటదారులు పడవ ద్వారా పెద్దిపల్లి నుంచి ఆవలి ఒడ్డున ఉన్న మణుగూరు చేరుకోవాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పడవ దాటిన వెంటనే సింగరేణి ఓపెన్ కాస్టు ఉండడం వల్ల కొందరు అధికారులు అటు వైపుగా ప్రయాణికులు వెళ్లేందుకు ఒప్పుకోవడం లేదని ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీఓ యస్‌కె.వలి, పంచాయతీ కార్యదర్శి యన్.సామ్రాజ్యం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మణుగూరురూరల్: సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తే టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కూనవరం రైల్వే గేట్ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఇన్‌చార్జ్ నాగెల్లి మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగులకు నష్టదాయకమే కాకుండా సంస్థను నిర్వీర్యం చేసే బొగ్గు గనుల వేలాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై మహాజన సభ



దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్ బేగం

దమ్మపేట: రైతు భరోసాపై సలహాలు, సూచనలు కొరకు దమ్మపేట కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం మండలంలోని మల్లారం రైతు వేదికలో నిర్వహించిన ఈ సమావేశంలో అశ్వారావుపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అఫ్జల్ బేగం రైతుల నుంచి సలహాలు కోరారు. పట్టాదారు పాసు పుస్తకాలు లేకున్నప్పటికీ సేద్యం చేస్తున్న రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని కొందరు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైతు భరోసాకు బదులుగా వ్యవసాయ సంబంధిత ఎరువులను ఇవ్వాలని కొందరు డిమాండ్ చేశారు. రైతు భరోసాను ఎకరాకు రూ.15,000లు ఇస్తామని ఎన్నికల హామీల్లో ప్రకటించి, నేడు మళ్లీ ఈ సలహాలు సూచనలు అవసరమా అని మరొకరు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, రావు గంగాధరరావు, ఎంపీటీసీ గూడపాటి వెంకట్రావు, కేవీ.సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, దారా యుగంధర్, ఎల్లిన మురళీ, గడ్డిపాటి సత్యం తదితర రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీలోని మణుగూరు క్లస్టర్ రైతువేదికలో రైతుభరోసా పథకంపై సలహాలు, సూచనల కోసం సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం ప్రత్యేక మహజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం రైతులు, పలువురు ప్రజాప్రతినిధులు సమావేశానికి తమ అభిప్రాయాలను విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సహకార అధికారి ఎస్‌డి.ఖుర్షీద్ మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను జిల్లా ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మండలంలోని అర్హులైన రైతులందరికి రైతు భరోసా వర్తింపజేయాలని తెలిపారు. పది ఎకరాల్లోపే రైతు భరోసా ఇవ్వాలని ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. సమావేశంలో మణుగూరు ఏడీఏ తాతారావు, ఏఓ రామశివరావు, ఏఈఓలు, ప్రజాప్రతినిధులు, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.